# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త





### ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో

## లాస్యకు జిల్లా ఫస్ట్ ర్యాంక్



వడమాలపేట,ఏప్రిల్ 27 ప్రభాతవార్త:
ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫలితాల్లో వడమాలపేట మండలం,కాయం గ్రామానికి చెందిన మంగిరెడ్డిగారి లాస్య ఎంపిసి గ్రూప్ నందు 470 మార్కులకు గాను 465 మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. లాస్య విజయవాడ శ్రీ చైతన్య కళాశాలలో చదువుతోంది. అత్యుత్తమ ర్యాంకు సాధించడం పట్ల ఆమె తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈమె తల్లి సురేఖ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది.

మొదటి ర్యాంకు సాధించిన లాస్య

## మానవత్వం చాటుకున్న మంత్రి పెద్దిరెడ్డి



శాంతిపురం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త
రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఓ యువకుడ్ని అటుగా వచ్చిన మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తన కారును ఆపి అతన్ని 108వాహనంలో చికిత్స కోసం కుప్పంకు తరలించారు. గురువారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కర్లగట్ట గ్రామం నుంచి తిరుపతికి కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో శాంతిపురం పాలారు బ్రిడ్జి వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. దీంతో మణి, భూపతి అనే యువకులు గాయపడ్డారు. అదేమార్గంలో వచ్చిన మంత్రి కారు ఆపి వారి కాలుకు కట్టు కట్టించి 108 ద్వారా ఆస్పత్రికి పంపారు.

# వంచించిందని హతమార్చాడు!

### దారుణానికి ఒడిగట్టిన ప్రియుడు
### హత్య కేసు చేధించిన చిత్తూరు పోలీసులు



విలేకరులతో మాట్లాడుతున్న దిశా డిఎస్పీ , చిత్తూరు డిఎస్పీలు

చిత్తూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:
ముక్కు,మొహం తెలియని యువకుడితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం చివరకు ఆ యువతి ప్రాణాలు బలితీసుకుంది. పరిచయమున్న వ్యక్తిలా యువతితో ఛాటింగ్ చేస్తూ ఇద్దరూ మనస్ఫూర్తిగా అభిప్రాయాలు కలవడంతో జీవితంలో ఒక్కటవ్వడానికి మూడుముళ్ళకు పథకం రూపొందించుకున్నారు. అయితే నమ్మించిన ప్రియురాలు మోసం చేస్తోందని భావించిన ప్రియుడే చివరకు ప్రాణాలను తీసేశాడు. ఈ విషాద ఘటన చిత్తూరు కొండమిట్టలో ఈ నెల 18వ తేదీ జరిగినా గురువారం చిత్తూరు పోలీసులు హంతకుడైన ప్రియుడ్ని అరెస్టు చేయడంతో చిక్కుముడి వీడింది. బ్యూటీషియన్ దుర్గా ప్రశాంతి హత్య కేసును దిశా, వన్‌టౌన్ పోలీసులు చేధించారు. ఈ కేసులో నిందితుడైన దుర్గాప్రశాంతి ప్రియుడు చక్రవర్తిని గురువారం తిరుపతి రుయా ఆసుపత్రి వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దిశా పోలీస్ స్టేషన్ డిఎస్పీ బాబు ప్రసాద్, చిత్తూరు డిఎస్పీ శ్రీనివాసమూర్తిలు బ్యూటీషియన్ దుర్గా ప్రశాంతి హత్య కేసు వివరాలను గురువారం చిత్తూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. చిత్తూరు కొండమిట్ట ప్రాంతంలో బ్యూటీపార్లర్ నడుపుతున్న దుర్గా ప్రశాంతికి గత ఏడాది అక్టోబర్‌లో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా దుబాయిలో వంట మాస్టర్‌గా విధులు నిర్వహించే చక్రవర్తి పరిచయం అయ్యాడు. ఇద్దరు ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేస్తూ సన్నిహితంగా మారారు. దుర్గా ప్రశాంతిపై ఇష్టం పెంచుకొన్న చక్రవర్తి తనని పెళ్ళి చేసుకోవాలని కోరాడు. దీనిపై దుర్గా ప్రశాంతి దుబాయ్‌లో వుండి పెళ్ళి చేసుకొంటాననంటే ఎలాగని, చిత్తూరుకు వచ్చి ఇక్కడే వుండి తన తల్లిదండ్రులను ఒప్పిస్తే పెళ్ళి చేసుకోవడానికి తాను సిద్ధమని ఆమె స్పష్టం చేసింది. ఎలాగైనా దుర్గాప్రశాంతిని పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించిన చక్రవర్తి ఈ ఏడాది ఫిబ్రవరి 6వ తేదీ దుబాయ్ నుండి నేరుగా చెన్నై దిగాడు. దుర్గా ప్రశాంతి చెన్నైకి వెళ్ళి చక్రవర్తిని రిసీవ్ చేసుకొని చిత్తూరుకు తీసుకువచ్చింది. చక్రవర్తి చిత్తూరు పొన్నియమ్మన్ గుడి వీధిలో ఒక ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను ప్రారంభించి తన తల్లిని సైతం ఇక్కడికి తీసుకుచ్చి వుంచుకొన్నాడు. ఈ క్రమంలో చక్రవర్తి తరచూ దుర్గాప్రశాంతిని కలుస్తూ వుండటంతో ఆమె తల్లి ఇందిరను చక్రవర్తికి పరిచయం చేసింది. ఈ క్రమంలో దుర్గ ప్రశాంతి ఈ మధ్యలో తనను పట్టించుకోకుండా ఇతర అబ్బాయితో సన్నిహితంగా వుంటుందని, తనకు అబద్దం చెప్పి ఆ అబ్బాయితో ఊరికి వెళ్ళిందని, దుర్గాప్రశాంతి తన ఫోన్‌ను సైతం స్విచ్‌ఆఫ్ చేయడంతో చక్రవర్తికి ఆమెపై మరింత అనుమానం పెరిగింది. ఈ మేరకు చక్రవర్తి దుర్గప్రశాంతి కోసం ఈ నెల 17వ తేదీ రైల్వేస్టేషన్ వద్ద కాపుకాశాడు. దుర్గప్రశాంతి ట్రైన్ దిగి ఇంటికి వెళ్ళిన అనంతరం చక్రవర్తి రైల్వే స్టేషన్‌లోనే ఆమెతో పాటు వచ్చిన వక్తితో గొడవ పడ్డాడు. ఈ విషయంపై దుర్గప్రశాంతి ఫోన్‌లో చక్రవర్తితో గొడవ పడింది. తనను అనుమానించే వ్యక్తితో పెళ్ళి చేసుకొని తాను సుఖంగా వుండలేనని, ఇంట్లో వారు సైతం రోడ్డుపై దుకాణం పెట్టుకొని వున్న వ్యక్తితో పెళ్ళి చేయడానికి ఒప్పుకోరని, ఇకపై తన దాని తాను చూసుకొంటానని తాను ఫోన్‌లో చాటింగ్ చేసిన విషయాలను తన వద్దకు వచ్చి డిలీట్ చేయాలని ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. దుర్గప్రశాంతిపై ద్వేషం పెంచుకొన్న చక్రవర్తి బతికితే ఇద్దరం కలిసి బతకాలని, లేకుంటే ఇద్దరం కలిసి చావాలని నిర్ణయించుకొన్నాడు. దుర్గ ప్రశాంతి తనను నమ్మించి మోసం చేసిందని, ఇకపై తాను బతకాల్సిన అవసరం లేదని ఫోన్‌లోనే ఒక సూసైడ్ నోట్ రాసుకొన్నాడు. ఆపై 18వ తేదీ మధ్యాహ్నం బ్యూటీ పార్లర్‌లో వున్న దుర్గా ప్రశాంతి వద్దకు వెళ్ళిన చక్రవర్తి తన ప్రేమను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నావని నిలదీశాడు. తన కోసం దుబాయ్ నుండి ఉద్యోగం వదలుకొని ఇంత దూరం వస్తే తనను నిర్లక్ష్యం చేసి ఇతర వ్యక్తితో సన్నిహితంగా వుండటం సహించలేకపోతున్నానని, తనను ప్రేమించాలని, పెళ్ళి చేసుకోవాలని గొడవ చేశాడు. ఇద్దరి మధ్య గొడవ పెరగడంతో చక్రవర్తి విచక్ష కోల్పోయి దుర్గ ప్రశాంతిపై ఆమెను హత్య చేయాలని గొంతు పిసికాడు. నాకు నువ్వు దక్కనప్పుడు నేనెందుకు బతకాలి. ఇద్దరం కలిసి చనిపోదాం అంటూ అక్కడే వున్న షేవింగ్ బ్లేడ్ తీసుకొని తన చేతి మణికట్టు మీద కోసుకొన్నాడు. రక్తం ఒక్కసారి చిమ్మి తనపై పడటంతో దుర్గప్రశాంతి ఊపిరి ఆడక భయాందోళనతో కుప్పకూలిపోయింది. ఆమె మృతి చెందిందని భావించిన చక్రవర్తి బ్లేడుతో తన గొంతుపై రెండు చోట్ల కోసుకొని ఆపస్మారక స్థితిలో కుప్పకూలిపోయాడు. సాయంత్రం 4 గంటల సమయంలో బ్యూటీపార్లర్‌లో రక్తమడుగులో పడివున్న దుర్గప్రశాంతి, చక్రవర్తిలను చూసిన ప్రశాంతి అమ్మ పోలీసులకు సమాచారం అందించింది. అక్కడికి చేరుకొన్న పోలీసులు దుర్గ ప్రశాంతి, చక్రవర్తిలను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే దుర్గాప్రశాంతి మృతి చెందడంతో కొన ఊపిరితో వున్న చక్రవర్తిని మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ నరసింహరాజు కేసు నమోదు చేశారు. ఆపై ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు దిశా స్టేషన్ డిఎస్పీ బాబు ప్రసాద్ ఈ కేసు విచారణ చేపట్టారు. ఈ కేసును పూర్తి స్థాయిలో విచారించి చేధించిన దిశా పోలీస్ స్టేషన్ డిఎస్పీ బాబు ప్రసాద్ తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చక్రవర్తి డిశ్చార్చీ కావడంతో గురువారం అతనిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో ఎస్ఐలు రమేష్‌బాబు, నాగసౌజన్య తదితరులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక భావన పెంపొందించడమే

# టిటిడి లక్ష్యం

### - టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి



పెనుమూరులో టిటిడి కళ్యాణ మండపానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పెనుమూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:
ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్లో అధ్యాత్మిక భావన పెంపొందించడమే టిటిడి ధ్యేయమని ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం పెనుమూరులో 3 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న టిటిడి కళ్యాణ మండపం నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 2 వేల దేవాలయాలు నిర్మించడమే టిటిడి లక్ష్యంగా నిర్ణయించుకొందన్నారు. ఇప్పటి వరకు వెయ్యి దేవాలయాల నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. ఎంతో వ్యయప్రయాసలతో తిరుమలకు కొందరు భక్తులు రాలేకపోతున్నారని, దీనిని దృష్టిలో వుంచుకొని టిటిడి గ్రామాల్లోనే దేవాలయాలు నిర్మించడం జరుగుతుందన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు టిటిడిలో భక్తుల సౌకర్యార్థం పలు అభివృద్ధి పనులు చేయడం జరిగిందన్నారు. డిప్యూటీ సిఎం నారాయణస్వామి మాట్లాడుతూ తాము కోరిన వెంటనే పెనుమూరులో టిటిడి కళ్యాణ మండపం నిర్మాణానికి ఛైర్మన్ నిధులు మంజూరు చేశారన్నారు. అలాగే నియోజకవర్గంలో 47 గ్రామాల్లో దేవాలయాలు నిర్మాణానికి నిధులు మంజూరుకు ఛైర్మన్ హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ విజయానందరెడ్డి, స్థానిక జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, స్థానిక వైకాపా నాయకులు కమలకర్‌రెడ్డి, దూది మోహన్, కృష్ణారెడ్డి, యశోదారెడ్డి, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సత్యవేడులో...**

సత్యవేడు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:
ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో తిరుమల తిరుపతి దేవస్థానం దేశవ్యాప్తంగా పెద్దఎత్తున హిందూ ధర్మప్రచారం నిర్వహిస్తోందని టిటిడి ఛేర్మేన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. సత్యవేడులో రెండు కోట్ల వ్యయంతో నిర్మించనున్న టిటిడి కళ్యాణ మండపానికి గురువారం ఆయన శంఖుస్థాపన చేశారు. ఈసంధర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వినతి మేరకు ఇక్కడ టిటిడి కళ్యాణ మండపం ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఈ కళ్యాణ మండపం ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. ఈకార్యక్రమంలో డిఫ్యూటి సిఎం నారాయణ స్వామి, ఎంపీ గురుమూర్తి, ఆర్టీసి వైస్ ఛేర్మేన్ విజయానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజుల పర్యటనకు నేడు గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్ రాక

### -ఉదయం వేదవిశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి హాజరు



తిరుమల,ఏప్రిల్ 27ప్రభాతవార్తప్రతినిధి:
పుణ్యక్షేత్రాల సందర్శనతోబాటు తిరుపతిలో శుక్రవారం ఉదయం జరిగే ఎస్వీవేదవిశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ఛాన్సెలర్ హోదాలో హాజరుకావడానికి రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్‌నజీర్ ఉదయం తిరుపతికి విచ్చేస్తున్నారు. నేడు, రేపు రెండురోజులు తిరుపతి,తిరుమల పర్యటనలో గవర్నర్ ఉంటున్నారు. ఉదయం తిరుపతి పద్మావతి అతిధిగృహం నుంచి మహతి ఆడిటోరియంకు వెళతారు. స్నాతకోత్సవం అనంతరం మధ్యాహ్నం తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు. సాయంత్రం 4.30గంటలకు తిరుపతి నుంచి తిరుమలకు విచ్చేస్తారు. రాత్రికి తిరుమలలో బసచేయనున్న గవర్నర్ జస్టిస్ నజీర్ శనివారం ఉదయం 7గంటలకు శ్రీవేంకటేశ్వరుని దర్శించుకుంటారు. తిరిగి పద్మావతి అతిధిగృహం చేరుకుని అల్పాహారం స్వీకరించి రోడ్డుమార్గంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకుని ఉదయం 10.25గంటలకు విజయవాడకు బయలుదేరి వెళతారు. రాష్ట్రగవర్నర్ తొలిసారి తిరుపతి,తిరుమల పర్యటనకు విచ్చేస్తున్న సందర్భంగా జిల్లా యంత్రాంగం, టిటిడి అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

### 5కోట్లతో మున్సిపల్ కార్యాలయం నిర్మాణంకు

## మంత్రి పెద్దిరెడ్డి భూమిపూజ



కుప్పం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త
కుప్పం మున్సిపాలిటీ నూతన కార్యాలయం నిర్మాణం పనులకు రాష్ట్ర అటవీ,గనులు, విద్యుత్ శాఖ మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూమిపూజ చేసారు. సుమారు 5 కోట్లతో ఈ నూతన భవనాన్ని నిర్మించనున్నారు. అలాగే స్థానికంగా మూడో వార్డు సచివాలయాన్ని, రాజన్న క్యాంటీన్‌లను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎం.పి. రెడ్డెప్ప, జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెస్కో ఛైర్మన్ సెంధిల్‌కుమార్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు మునస్వామి, హఫీజ్, కమీషనర్ నరసింహ ప్రసాద్, కౌన్సిలర్లు, రాష్ట్ర నేత కృష్ణమూర్తి, పరిశీలకుడు రెడ్డెప్ప, మండల కన్వీనర్ హెచ్‌ఎం మురుగేష్, ఎంపిపి అశ్విని, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, రాష్ట్ర కారో ్పరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, స్థానిక నేతలు పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంలో అమ్మవారిని మంత్రి పెద్దిరెడ్డి దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్‌ల నివాసాలకు వెళ్లి తేనీరు స్వీకరించారు. అంతకుముందు మంత్రి డా॥ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి నేతలు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు.

## రీ- సర్వే రాళ్లు తొలగిస్తున్న రైతులు

### భూముల లెక్కల్లో తేడాలని ఆవేదన

కుప్పంరూరల్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారంకు ప్రతిష్టాత్మకంగా సమగ్ర భూముల రీసర్వే కార్యక్రమం చేపట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో రైతుల భూములకు సంబంధించి గ్రామాల్లో రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు సర్వే చేస్తున్నారు. అయితే ఈ రీ సర్వేలో తమ భూములకు సంబంధించిన లెక్కల్లో, కొలతల్లో తేడాలు వస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని ములకలపల్లిలో రీసర్వే పూర్తయిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు రాళ్లు నాటారు. అయితే ఈ రాళ్లను పలువురు రైతులు తమ పొలాల వద్ద నుంచి తొలగించడం చర్చనీయాంశమైంది. మరోపక్క మిగతా రాళ్లను నాటరాదని పేర్కొన్నారు. దీంతో సర్వే రాళ్లను అధికారులు చేసేది లేక గ్రామంలోనే ఉంచారు. తమ భూములకు సంబంధించి వివరాలు తప్పులుగా చూపుతుండడంతో పక్క పొలాల వారితో ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయని రైతులు వాపోతున్నారు. ఈ భూముల లెక్కల్లో తేడాలతో ఒకే కుటుంబంలో భూమి విషయంగా తగాదాలు సైతం ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు తమ భూములకు సంబంధించి సర్వేలో ఖచ్చిత ంగా భూముల లెక్కలు తేలితేనే తాము సరే ్వ రాళ్లు నాటించుకుంటామని లేకుంటే అవసరం లేదని రైతులు పేర్కొంటున్నారు. రీసర్వే పాస్ పుస్తకాల్లో సైతం భూముల వివరాలు తక్కువగా ఉన్నాయని తమ పరిస్థితి ఏ ంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. మరి జిల్లా ఉన్నతాధికారులు ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారో వేచి చూడాలి.

## యాళివాహనంపై దేవదేవుడు



చౌడేపల్లి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త
అభీష్టధ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం దేవదేవుడు యాళివాహనంపై ఊరేగాడు. ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్‌దీక్షితులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. వాహనసేవకు పట్టణానికి చెందిన అశోక్, సుదర్శన్‌లు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

## ట్రాక్టర్, మోటార్ సైకిల్ ఢీ : ఒకరు మృతి

ఓజిలి, ఏప్రిల్ 27, ప్రభాతవార్త
ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబలించింది. ట్రాక్టర్ , మోటార్ సైకిల్ ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన గురువారం ఓజిలి మండలంలోని మాచవరంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఓజిలి మండలం మాచవరం గ్రామానికి చెందిన పుచ్చలపల్లి శ్రీనివాసులు రెడ్డి, ఆయన భార్య పుచ్చలపల్లి గీతమ్మ మోటారు సైకిల్‌లో పొలం వద్దకు వెళ్లి ఇంటికి తిరుగు ప్రయాణంలో అటు వైపు నుంచి నాయుడుపేట వైపు జామాయిల్ కట్టెలు లోడుతో వస్తున్న ట్రాక్టర్ మోటార్ సైకిల్‌ను ఢీకిట్టింది. ట్రాక్టర్ చక్రాలు కింద పడిపోయిన గీతమ్మను ట్రాక్టర్ తొక్కివేయడంతో అక్కడికక్కడే మృతి



చెందిందని స్థానికులు తెలిపారు. ఈ విషాధకర సంఘటనతో భర్త శ్రీనివాసులు రెడ్డి వారి కుటుంబ సభ్యులను తీవ్ర దు:ఖానికి గురిచేసింది. దీంతో మాచవరం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కళ్లముందున్న భార్య మృతదేహం చూసి కుటుంబం, గ్రామస్తులు చుట్టుపక్కల ప్రజలు రోధిస్తున్న తీరు పలువురిని కంటతడిపెట్టించింది. దేవుడా మా కుటుంబానికి ఎందుకింత అన్యాయం చేశావంటూ వారు గుండెలవిసేలా విలపించారు. ఈ ప్రమాదంపై ఓజిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# రూ. 6కోట్లతో వరదరాజస్వామికి కొత్త ఆలయం



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 27 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఒకే ఒక వైష్ణవాలయం ప్రసన్న వరదరాజ స్వామి ఆలయం ఈ ఆలయ జీర్ణోద్ధారణ, పునర్నిర్మాణ కార్యక్రమాలను గురువారం వైష్ణవ ఆగమశాస్త్ర పండితులు నిర్ణయించిన మూహూర్తాన భూమి పూజ మహోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం నిర్ణయిం చిన మూహూర్తానికి కార్యక్రమాలను ఆలయ ఇఓ, ఆర్‌జెసి వికె సాగర్‌బాబు దంపతుల పర్యవేక్షణలో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు దంపతుల సంకల్పంతో భూమి పూజలు నిర్వహించారు. ముఖ్యఅతిధిగా శ్రీభాష క ర సిద్ధాంత పీఠాధిపతి శ్రీ శ్రీ త్రిదండి రామచంద్రరామానుజ జియర్‌స్వామి హాజరయ్యారు. భూమి పూజా కార్యక్రమాలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ పూజారి శ్రీనివాస శర్మ, వేదపండితులు దర్భా బాలసుబ్రమణ్యం పర్యవేక్షణలో

### శాస్త్రోక్తంగా భూమి పూజలు

కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమాలను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి విగ్రహ ప్రతిష్ట కుంబాభిషేకం నిర్వహిస్తామని ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రటించారు.

**రూ. 6కోట్లతో కొత్త ఆలయం:**

దేవాదాయశాఖ స్తపతి పరిశీలించి ఆలయ నిర్మాణం పూర్తిగా దెబ్బతిన్నదని పునర్నార్మాణం తప్పని సరి అనటంతో రూ.6కోట్ల బడ్జెట్‌తో టెండర్లు పిలిచారు. ఈ పనులకు గురువారం భూమి పూజ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. భూమి పూజలకు విచ్చేసిన శ్రీభాష క ర సిద్ధాంత పీఠాధిపతి శ్రీ శ్రీ త్రిదండి రామచంద్ర రామానుజ జియర్‌స్వామి హాజరయ్యారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆధ్మాత్మిక ప్రసంగం చేసారు. ఆలయ ఆవరణ గోవిందనామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి ఆర్‌డిఓ కె.యస్‌రామారావు, దేవాదాయశాఖ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఇ పుల్లయ్య, ఈఈ మురళీధర్‌రెడ్డి, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, ఎలక్ట్రికల్ ఎఇ సుబ్బారెడ్డి, ఎఇఇ కిషోర్‌కుమార్, స్థపతి కుమార్ చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యులు పసల సుమతి, కొండూరు సునిత, రమాప్రభ, లక్ష్మీ, ప్రత్యేకాహ్వానితులు జూలుగంటి సుబ్బారావు, ఆలయ అభివృద్ధి కమిటి ఛైర్మెన్ రాముగుప్తా, వైస్ ఛైర్మెన్ సురేంద్రబాబు(చిట్టి), స్థానిక ప్రముఖులు కొండూరు నంద, స్వర్ణమూర్తి, జూలుగంటి మురళి తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమకే తిరుపతి గంగ జాతర తలమానికం

### గంగమ్మ స్వర కుంభాభిషేకం ఆల్బమ్ సీడీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన



తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త
రాయలసీమకే తిరుపతి గంగ జాతర తలమానికమని, గంగమ్మ తల్లి ఆలయ ప్రాశస్త్యం భారత జాతికి తెలియాలని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం తిరుపతిలోని భీమాస్ రెసిడెన్సీలో జాతర సందర్భంగా రూపొందించిన శ్రీ తాతయ్యగుంట గంగమ్మ స్వర కుంభాభిషేకం ఆల్బమ్ సీడీని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని మొట్టమొదటి గ్రామ దేవత దేవాలయం తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లి ఆలయమన్నారు. తిరుపతి గంగమ్మ ఆలయం నుంచే జానపద పండుగ భావస్ఫూర్తి దేశానికి వ్యాపించిందన్నారు. అక్క చెల్లిలకు సారె సమర్పించే సాంప్రదాయం ఇక్కడే మొదలైందని, ఐదు వందల సంవత్సరాల కిందట నుంచే తిరుమల శ్రీ వారి ఆలయం నుంచి తన చెల్లి గంగమ్మకు సారె సమర్పించే సంప్రదాయం కొనసాగుతోందన్నారు. గంగమ్మ దర్శనం తర్వాతే తిరుమల శ్రీవారిని దర్శించుకునే విధానం గతంలో ఉండేదని అన్నారు. తిరుమల శ్రీవారి దేవేరైన, తిరుచానూరు పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగే పంచమీతీర్థం సందర్భంగా అమ్మవారికి సమర్పించే పసుపు, కుంకుమలను గంగమ్మ తల్లి ఆలయం వద్ద నుంచే తీసుకెళ్లే విధానం గతంలో ఉండేదన్నారు. తిరుపతి గంగమ్మ ఆశీస్సులు వల్లే మన ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాలు లేవని గత వెయ్యేళ్లలోనూ ఇక్కడ కలరా అంటే ఎమిటో తెలియదన్నారు. గంగమ్మ వైభవాన్ని దేశవ్యాప్తం చేయడంలో మీడియా సహకారం అవసరమన్నారు. జాతీయ మీడియాను ఇక్కడికి ఆహ్వానించే ఆలోచన ఉందన్నారు. గంగమ్మ స్వర కుంభాభిషేకం ఆల్బమ్ రూపకల్పన వెనుక కిషన్ కృషి వుందని కిషన్‌తో పాటు బృందంలోని సంపత్, జశ్వంత్‌లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఢీజే వాహనాల ద్వారా నగరంలో ప్రజల కోసం ఆల్బమ్‌ను తీసుకెళ్లే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ డా. శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, గంగమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ కట్టా గోపి యాదవ్, ఈవో మునికృష్ణ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో ఎంజిఎం విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త




పట్టణంలో ఉన్న ఎంజిఎం జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ పరీక్ష ఫలితాల్లో 85శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయి మార్కులు సాధించి పట్టణంలోనే ప్రథమస్థానం కైవసం చేసుకున్నామన్నారు. అంతేకాకుండా జూనియర్ మరియు సీనియర్ ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించారు. జూనియర్ ఎంపిసిలో ఎస్.భార్గవి(465/470), కె.నందు(463/470) మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకుల్లో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుందన్నారు. జూనియర్ బైపిసిలో ఏ.పతాంజలి(430/440), మునిచిత్ర(420/440) మార్కులు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా జూనియర్ సీఈసీలో ఎస్‌కె.జామీర్(449/500), ఎస్‌కె.షాకీర్(441/500) మార్కులు సాధించారు. సీనియర్ ఎంపిసిలో పునీత్‌రాజ్‌కుమార్(984/1000), సీనియర్ బైపిసిలో ధనుష్‌రెడ్డి(982/1000), సీనియర్ ఎంఈసిలో ఎస్.జ్ఞానప్రసూన(973/1000), సీనియర్ సిఈసిలో ఎస్.విధిత(947/1000) మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలోనే కాకుండా పట్టణంలో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వివిఎస్.రత్నం,అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దుర్గిపేరిలో సిపాయి భరోసా!

శ్రీకాళహస్తిరూరల్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియజకవర్గ ప్రజలకు రష్‌ఆసుపత్రి అధినేత,ఎంఎల్‌సి డాక్టర్‌సిపాయి సుబ్రమణ్యం సిపాయి భరోసా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంతో 2009 నుంచి రాజకీయ అనుబంధం ఉన్న డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం వైద్యపరంగా నియోజకవర్గం నుంచి ఎవరు వెళ్ళినా ఆదుకకుంటున్నారు.ఈ నేపధ్యంలో ఇటీవల జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో వైకాపా పార్టీ ఆయన సేవలను గుర్తించి ఎంఎల్‌సిగా ఏకగ్రీవంగా ఎంపిక చేసారు. అప్పటి నుంచి తాను సామాజిక సేవల్లో పాల్గొనాలనే లక్ష్యంతో వన్నెకుల క్షత్రియుల కుటుంబాల్లో ఎదైనా ఇబ్బంది జరిగతే ఆదుకోనుటకు 'సిపాయి భరోసా'కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నారు.ఈ నేపధ్యంలో గురువారం ఏర్పేడు మండలంలోని దుర్గిపేరి గ్రామంలో ఇటీవల దొడ్డిమునెమ్మ మృతి చెందారు. ఈ కుటుంబాన్ని పరామర్శించిన ఆయన మునెమ్మ కుటుంబానికి చెందిన దొడ్డి హరినాథ్‌రెడ్డికి 40 రకాల నిత్యావసర సరకులను అందించారు.ఈ కార్యక్రమాల్లో దశరధరామిరెడ్డి,జి.మునిచంద్రారెడ్డి,డాక్టర్ బాబు, డాక్టర్ రామన తదితరులు పాల్గొన్నారు.

## ఐఎంఓలో బంగారుపతకం సాధించిన ద స్కూల్ విద్యార్థి

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తికి చెందిన చిన్నారులు చదువుల్లో తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తున్నారు. జాతీయస్థాయిలో పలువురు విద్యార్థులు పురస్కారాలు అందుకుంటున్నారు. గురువారం అందిన సమాచారం మేరకు ఇంటర్నేషనల్ మ్యాథమ్యాటిక్స్ ఒలింపియాడ్ (ఐఎంఒ) సెకండ్ లెవల్‌లో ద స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న జనమాల గురుసాత్విక బంగారుపతకాన్ని సాధించి శ్రీకాళహస్తి పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేసారు.ఇంటర్నేషనల్ ర్యాంక్ 32, రిజనల్ ర్యాంక్ 31,జోనల్ ర్యాంక్ 28,సిటి ర్యాంక్ 4 స్కూల్ ర్యాంక్ 4లను సాధించినట్లు వివరించారు.జాతీయస్థాయిలో మంచిపేరు సాధించిన ది స్కూల్ విద్యార్థిని పలువురు సత్కరించారు.ఆ విద్యార్థిని యాజమాన్యం, ఉపాధ్యాయులు సత్కరించారు.

## మే 13న జరిగే లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త



మే 13వ తేదీ జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్‌జడ్జి బేబీరాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా గురువారం కోర్టు సముదాయం లో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్ ద్వారా అధికసంఖ్యలో కేసులు పరిష్కరించుకోవడానికి సహకరిస్తూ వచ్చేనెల మే 13 జరిగే జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి కృషిచేయాలని రాజీమార్గమే రాజమార్గంగా ఎన్నుకుని ఎక్కువకేసులను పరిష్కరించడానికి దోహదపడానికి కోరారు. సమావేశంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి కమల్‌కుమార్, కోర్టు పరిధిలో ఉన్న అన్ని పోలీసుల అధికారులు,ఎంవిఐ, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటి స్థలాలను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

కేవీబీ పురం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కేవీబీ పురంలో గురువారం ఉదయం 11 గంటలకే కేవీబీ పురంలోని విద్యుత్



సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న మిట్ట ఇండ్లు బీసీ కాలనీలో ఇంటి స్థలాలను సర్వే చేసి అందులో అర్హులను గుర్తించి ఖాళీ ఇంటి స్థలాలను అర్హులైన వారికి 90 రోజుల పథకంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని తిరుపతి జిల్లా జాయింట్‌కలెక్టర్ బాలాజీ తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి ఆదేశించారు. కేవీబీ పురం మండలంలో ఇంటి స్థలాలను తిరుపతిజిల్లా జాయింట్ కలెక్టర్ బాలాజీ, శ్రీకాళహస్తి ఆర్డీవో పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగి ఈసీ సమీక్ష ఏఎస్‌వో, మండల సర్వేయర్లు, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌వోలు, కార్యదర్శులు, పంచాయతీ సెక్రటరీలు, తహసీల్దార్, అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఆర్డీవో రామారావు, తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి, మండల ఎంపీపీ రాయదుర్గం నందకుమార్, సర్పంచ్ గిరి, ఎంపీటీసీ అయ్యప్ప, తొట్టంబేడు మార్కెటింగ్ కమిటీ ఏఎంసీ డైరెక్టర్ హరిబాబురెడ్డి, రాయపేడు హరిబాబు, ప్రేమ్‌కుమార్, ఎస్సీ సెల్ అరుణ్, యూత్ కార్యకర్త మని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం యాదవ్, మండల సర్వేయర్లు, సచివాలయ వంశి, మురళి, సర్వేయర్లు, వీఆర్‌వోలు మునిగోపాల్, ఈశ్వరయ్య, పంచాయతీ సెక్రటరీలు గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శంకర వినాయక ఆలయ కుంభాభిషేక వేడుకలు

నగరి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:



మండలంలోని బుగ్గ అగ్రహారం గ్రామంలో బుగ్గ కాశీ విశ్వేశ్వరాలయ సమీపంలో బుగ్గ శంకర మఠంలో శ్రీ ఆదిశంకర శ్రీ శంకర వినాయక ఆలయ కుంభాభిషేక వేడుకలు గురువారం వైభవంగా జరిగింది. శంకర విజయేంద్ర సరస్వతి శంకరాచార్య స్వామివారి ఆధ్వర్యం లో వేడుకగా నిర్వహించిన కుంభాభిషేక వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయేంద్ర సరస్వతి భక్తులతో మాట్లాడుతూ 1932లో బుగ్గలో శంకరాచార్యుల వారు చాతుర్మాస్యను ఆచరించారన్నారు. దీంతో ఆలయ పరిసరాల్లో శ్రీ శంకర మఠం స్థాపించబడిందన్నారు. 2006లోకుంభాభిషేకం నిర్వహించడం జరిగిందని ప్రస్తుతం ఆదిశంకర, శ్రీ శంకర వినాయక దేవాలయాల జీర్ణోద్ధారణ అష్టబంధన మహా కుంభాభిషేక వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో వినాయక పూజ, గృహప్రీతి, పుణ్యవచనం, మృత్యుంజయ హోమం, నవగ్రహ హోమం, వాస్తు హోమం నిర్వహించారు. అనంతరం కలశ పూజ నిర్వహించి విమాన మహా కుంభాభిషేకం నిర్వహించారు.

## వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 27, ప్రభాతవార్త



తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వీధి కుక్కల నియంత్రణకు నిబంధనల మేరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత స్పష్టం చేసారు. వీధి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలనే ఫిర్యాదులు తరుచుగా రావడంపై దృష్టి సారించిన కమిషనర్ హరిత గురువారం తూకివాకం దగ్గర కుక్కల జనన నియంత్రణ సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాంబర్లో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు పాల్గొనగా మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, అనిమల్ కేర్ ల్యాండ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీకాంత్ తో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ, సుప్రీం కోర్టు మార్గదర్శకాలు ప్రకారం వీధి కుక్కలను పట్టుకొని జనన నియంత్రణ ఆపరేషన్లు చేయడం, రాబిస్ టీకాలు వేయించడంతో బాటు వాటిని వారం రోజుల పాటు డాక్టర్ల పర్యవేక్షణలో సంరక్షించిన తరువాత తిరిగి వాటిని పట్టుకున్న చోటనే విడిచిపెట్టడం చేయాలన్నారు. తూకివాకంలోని వీధి కుక్కల జనన నియంత్రణ, రాబిస్ టీకాలు కేంద్రాన్ని పరిశుభ్రంగా వుంచాలని సూచిస్తూ తగిన సూచనలను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు.

## ఇంటర్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు

తిరుపతి (క్రీడ), ఏప్రిల్ 27, ప్రభాతవార్త



జూనియర్, సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించి విజయకేతనం ఎగురవేసినట్లు ఎమరాల్డ్స్ డైరెక్టర్లు ఇ. గిరిధర్ రెడ్డి, కె. విశ్వనాధ రెడ్డిలు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంఐసి కోర్సు నందు సి. తరుణ్ కుమార్ 976, జె. శిరి 973, ఎం. లావణ్య 973, సిఈసి కోర్సులో ఎం. ప్రజన 966, మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. జూనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంఈసి కోర్సు నందు ఎం. రాధిక 485, సిఈసి కోర్సులో ఆర్. కుషి 486 మార్కులు సాధించి టాపర్లుగా నిలవడం జరిగింది. మొత్తంగా సీనియర్ ఇంటర్‌లో 96.24 శాతం, జూనియర్ ఇంటర్‌లో 83.78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వారు తెలిపారు.

## ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రతిభకనబరచిన విద్యార్థులు

పుత్తూరురూరల్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:



ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఉత్తమ ఫలితాలు సాధించిందని ప్రిన్సిపాల్ రఘుపతి తెలిపారు. ఈ ఫలితాలు సాధనకు కృషి చేసిన విద్యార్థినులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. మొదటి సంవత్సరం మొత్తం 241 మందికి 137 మంది 57 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం మొత్తం 200 మందికి 143 మంది 71.5 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలిపారు. మొదటి సంవత్సరంలో సీఈసీ ఎం.ఉషశ్రీ(474/500), ఎస్.విజిత(474/500), ఎంపీసీలో పి.జయలక్ష్మి(328/470), బైపీసీలో ఏ.ఎఫ్.అయాష(425/440) రెండో సంవత్సరం బైపీసీలో ఎం.దివ్య(950/1000), ఎంపీహెచ్‌డబ్లు పి.త్రిష(931/1000), సీఎస్‌ఈ ఎం.కన్నెమ్మ(985/1000) మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

## గురుకుల పాఠశాలలో 79 శాతం ఇంటర్ ఫలితాలు

పుత్తూరురూరల్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:



పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విశేష ప్రతిభకనబరచినట్లు ప్రిన్సిపాల్ సుమిత్రాదేవి తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 79 శాతం ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. 68 మంది విద్యార్థులకు గాను 54 మంది పాసయ్యారని, అలాగే మొదటి సంవత్సరంలో 66 మంది విద్యార్థులకు గాను 37 మంది పాసయ్యారని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఏ.తనూజ సీఈసీ విభాగంలో 953 మార్కులు, హెచ్‌ఈసీలో స్రవంతి 930 మార్కులు సాధించినట్లు వివరించారు.

## ఐ.ఎస్.టి.ఈ.చాప్టర్ సాంకేతిక పురోభివృద్ధికి దోహదం

ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుకుమార్

చంద్రగిరి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:



ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐ.ఎస్.టి.ఈ) స్టూడెంట్ చాప్టర్ అధ్యయనం విద్యార్థుల సాంకేతిక పురోభివృద్ధికి దోహదపడగలదని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (అగరాల) ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుకుమార్ అన్నారు. కళాశాలలో గురువారం ఐ.ఎస్.టి.ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐ.ఎస్.టి.ఈ ద్వారా ఉన్నత స్థాయిలో ఉజ్వలమైన భవిష్యత్తును పొందగలరన్నారు. ఈ క్రమంలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాలలోని 156 మంది విద్యార్థులు ఐ.ఎస్.టి.ఈ సభ్యులుగా నమోదు చేసుకున్నారు. ముఖ్యతిథిగా విచ్చేసిన ఎల్.శివప్రసాద్ రెడ్డి సభ్యులకు గుర్తింపు కార్డులను అందజేసిన ఆయన ఐ.ఎస్.టి.ఈ. ప్రొఫెషనల్‌బాడీలలోఅనుబంధం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్‌పి.భక్తవత్సలం,డాక్టర్‌పి.నాగేంద్ర, డాక్టర్ టి.నరశింహారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బోధకాలు ప్రాణాంతక వ్యాధి కాదు.!

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీహరి

రామచంద్రాపురం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:



బోధకాలు ప్రాణాంతక వ్యాధికాదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీహరి అన్నారు. గురువారం కమ్మపల్లి పిహెచ్‌సిలో బోధకాలు నిర్మూలనపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బోధకాలు వ్యాధిగ్రస్థులకు వ్యక్తిగత పరిశుభ్రతను వివరించి కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బోధకాలు వ్యాధిగ్రస్థులకు పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యక్తిగతంగా పలు జాగ్రత్తలతో వ్యాధిని అదుపు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి అభివృద్ధి కమిటీ చైర్మన్ మహిరెడ్డి, ఎంపిటిసి రాజేష్, వైద్యాధికారి డాక్టర్ హేమలత, మలేరియా అధికారులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ రూప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ

రామచంద్రాపురం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:



మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని సామాజిక తనిఖీ బహిరంగ సభ గురువారం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. సామాజిక బృందం మార్చి 8 నుండి 18 వరకు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో క్షేత్ర స్థాయిలో పనులు, రికార్డులను పరిశీలించారు. ఉపాధిహామీ, పంచాయతీ రాజ్, ఎస్ఎస్ఏ శాఖలలో 773 పనులకు రూ.10.43 కోట్లు వ్యయం చేశారు. ఈ తనిఖీలలో వెలుగుచూసిన అవకతవకలను పిడి శ్రీనివాస్ ప్రసాద్, జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మిలకు వివరించారు. ఈ తనిఖీలలో స్వల్ప మొత్తం రూ.13070/-లు అవినీతి జరిగినట్లు తేల్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏ.వి.బ్రహ్మానందరెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిడిఓ మహ్మద్‌రఫీ, ఏపిడి పద్మలత, అంబుడ్స్‌మన్ రాసరాయ నాయుడు, ఏపిఓ హంసవేణి, ఎస్‌ఆర్‌పి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన "బాలాలయ సంప్రోక్షణ"

చంద్రగిరి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:

మండల పరిధిలోని కందులవారిపల్లిలోని శ్రీశేషాచల లింగేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం ఉదయం బాలాలయ సంప్రోక్షణ పూర్ణాహుతితో ముగిసింది. ఇందులో భాగంగా ఉదయం 7.30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాల పూజలు నిర్వహించారు. అనంతరం 10.55 గంటలకు పూర్ణాహుతి సంప్రోక్షణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ పార్ధసారధి, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఆలయ అర్చకుల పార్ధసారధి, తదితరులు పాల్గొన్నారు.

## మన కొండను మనమే శుభ్రం చేసుకుందాం!

- నివాసగృహాల పరిశుభ్రతపై జెఇఓ వీరబ్రహ్మం

తిరుమల,ఏప్రిల్ 27ప్రభాతవార్తప్రతినిధి:



పుణ్యక్షేత్రం తిరుమలకొండపై నివాసగృహాలుండే బాలాజీనగర్, ఆర్‌బి సెంటర్లు ప్రాంతాల్లో మనకు మనమే పరిశుభ్రత పాటిద్దామని, చెత్తాచెదారాలను తొలగించుకుందామని జెఇఓ వీరబ్రహ్మం పిలుపునిచ్చారు. పారిశుధ్యం నిర్వహణకు స్థానికులు, సిబ్బంది,వ్యాపారులు వాలంటీర్లుగా ముందుకు రావాలని కోరారు.

## శివయ్య సేవలో మాజీ మంత్రి చెంగారెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరుని సేవలో మాజీ మంత్రి రెడ్డివారి చెంగారెడ్డి కుటుంబసభ్యులతో గురువారం పాల్గొన్నారు. వారికి ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు వేదపండితులతో స్వాగతం పలికారు.చిత్తూరుజిల్లా రాజకీయాల్లో తనదైన శైలిలో రాజకీయం నిర్వహించారు. ఆయనకు శ్రీజ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరుని అంతరాలయం దర్శనం చేసుకున్నారు.తరువాత వారు గురుదక్షిణామూర్తి ఆలయంలో నిర్వహించిన గురువుకు షోడశాభిషేకాలు నిర్వహిస్తుండగా హాజరయ్యారు. గురుదక్షిణామూర్తిని దర్శించుకుని పూజలు జరిపారు.పూజల తరువాత చెంగారెడ్డి దంపతులను మృత్యుంజయ స్వామి అలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు,స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను అందించారు.స్వాగతం పలికిన వారిలో ప్రత్యేకాహ్వానితులు చింతామణి పాండు హాజరయ్యారు. ఏర్పాట్లును టెంపుల్ ఇన్సెపెక్టర్లు హరియాదవ్, సుదర్శనం, సూపరింటెండెంట్ నాగభూషణం పర్యవేక్షించారు.

## ఇంటర్ ఫలితాల్లో రాయలసీమ విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త



ఈఏడాది మార్చిలో జరిగిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర జిల్లా స్థాయిలో రాయలసీమ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపర్చినట్లు కరస్పాండెంట్ కాయంసుబ్బరామిరెడ్డి, ప్రిన్సిపల్ జయభారత్‌రెడ్డిలు ఓ ప్రకటనలో తెలిపారు. వీరు మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరం ఎంపిసి గ్రూపులో ఎస్.రమ్య(985), కె.పుష్పాంజలి(980), బైపిసిలో వి.వందన(972),మైథిలి(964), కె.తులం (952), మరియు సిఈసి గ్రూపులో జె.జయశ్రీ (966), ఇ. రాజేశ్వరి(947) రాష్ట్ర స్థాయి మార్కులు సాధించి శ్రీకాళహస్తి పట్టణంలో ప్రథమస్థానాన్ని కైవసం చేసుకున్నామన్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ఎంపిసిలో ఎన్.హరి(455/470), సి.ఎ.గోమతి(453/470), ఎఆర్.అమ ర్‌నాథ్(450/470), సిఇసి గ్రూపులో ఆర్.కీర్తన(479/500), ఆర్.అజయ్‌కుమార్(474/500), సి.తేజ(470/500) రాష్ట్ర స్థాయి మార్కులు సాధించి కళాశాల ప్రతిష్టను ఇనుమడింపచేశారన్నారు.

# తిరుపతి డివిజన్

## ఇంటర్ ఫలితాల్లో హిమజ విద్యార్థుల ప్రతిభ

పుత్తూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :



ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో పట్టణంలోని హిమజ జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. సీనియర్ ఇంటర్‌లో మొత ్తం 1000 మార్కులకు గాను ఎంపిసి విభాగంలో వి.ప్రీతి 970 మార్కులు, బైపిసిలో ఎ.వైష్ణవి 970, ఎం.గణేష్ 883 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో ఎస్.వి.రాహుల్ 463/500, కె.జాహ్నవి 457/470, ఎ.యశోస్విని 411/440 మార్కులు పొందారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని, తల్లితండ్రులను హిమజ విద్యా సంస్థల ఛైర్మన్ ఎం.సురేంద్రరాజు, ప్రిన్సిపల్ ఇ.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో అభినందించారు.

## మంత్రిగారు చెఱుకు బకాయిలు ఇప్పించండి

రాష్ట్ర యస్‌సి సెల్ ఉపాధ్యక్షులు ధశరదవాసు



నింద్ర, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:

నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి ఆర్‌కె రోజా నేటమ్స్ షుగర్ ప్యాక్టరీ యాజమాన్యం నుంచి రైతులకు చెల్లించవలసిన బకాయిలను వెంటనే ఇప్పించాలని యస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధశరదవాసు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సెల్పి చాలెంజ్ వైయస్‌ఆర్ కాంగ్రెసు పార్టీ ఇచ్చిన కౌంటర్ స్పందించినారు. ఆయన మాట్లాడుతూ 2020లో నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే ఆర్‌కె రోజా రైతులకు చెల్లించవలసిన బకాయిలను ఇప్పిస్తామని మూడు సంవత్సరాలు వాగ్దానం చేసారని, వాటి ప్రకారం యాజమాన్యం నుంచి బకాయిలను ఇప్పించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పేరం వెంకటేశ్వరరావు,నాయకులుబాబుయాదవ్,సంపూర్ణమ్మ,పరదేశి,రాము,రమేష్,ప్రశాంత్‌కుమార్, విజయ్ కుమార్, శరవణ,జగన్ తదితరులు పాల్గొన్నారు.

## పుత్తూరు సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో వేడుకగా గ్రాడ్యుయేషన్ డే సంబరాలు

నారాయణవనం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త :



పుత్తూరు సమీపం నారాయణవనం మండలంలోని సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ద్వితీయ గ్రాడ్యుయేషన్ డే సంబరాలు అంగరంగ వైభవంగా జరిగింది. 2022-23 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన వారికి డిగ్రీలను అందించడం జరిగింది. స్థానిక ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ఇండియన్ ఏరోస్పేస్ సైంటిస్ట్ పద్మభూషన్ అవార్డు గ్రహీత నంబి నారాయణన్, జెఎన్‌టియు వైస్ చాన్సలర్ రంగ జనార్ధన, కళాశాల ఛైర్మన్ డాక్టర్ కొందూరు అశోకరాజులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైంటిస్ట్ నంబి నారాయణన్ మాట్లాడుతూ బీటెక్ విద్యార్థుల ఆఖరి దశలో చేసే ప్రాజెక్టులు ఇన్నోవేటీవ్‌గా వుండాలన్నారు. దాని ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపైచ పట్టు సాధిస్తారన్నారు. అంతేకాకుండా బీటెక్ తర్వాత ఎంటెక్ ప్రముఖ ఐఐటి లేదా ఎన్‌ఐటిలలో మాస్టర్స్ చేయడం వల్ల సాంకేతిక పరంగా అభివృద్ధి చెందవచ్చున్నారు. జెఎన్‌టియుఎ వైస్ చాన్సలర్ రంగ జనార్ధన మాట్లాడుతూ ద్వితీయ గ్రాడ్యుయేషన్‌లో పట్టా తీసుకున్న విద్యార్థులందరు మంచి ఇంజనీర్లుగా స్థిరపడి దేశానికి సేవ చేయాలన్నారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ కొందూరు అశోకరాజు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి తమ వంతు కృషి చేస్తున్నట్టు గుర్తు చేశారు. సైటెక్‌లో 543మంది, సిస్టెట్‌లో 241మంది గ్రాడ్యుయేటర్లుగా పట్టా తీసుకున్నారు. అలాగే వివిధ విభాగాల్లో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులకు సర్టిఫికేట్లు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ పవర రీసెర ్చ ఇన్‌స్టిట్యూట్ బెంగులూరు డైరెక్టర్ సేథురామన్, శంకర శేఖరరాజు, షేక్ నజీరా, వైస్ ఛైర్మన్ ఇందిరావేణి, ప్రిన్సిపాల ్స చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధన్‌రాజు, గోపినాద్, విజయభాస్కర్, గోపి, విభాగాది పతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సులభ్ కార్మికుల జీవితాలతో ఆడుకోవద్దండి!

-టిటిడి యాజమాన్యానికి డా॥పసుపులేటి హరిప్రసాద్ హెచ్చరిక

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఏప్రిల్ 27 ప్రభాతవార్త:



గత 20 ఏళ్లకు పైగా చాలీ చాలని జీతాలతో కుటుంబాలను అతి కష్టం మీద పోషించుకుంటూ నిస్వార్థంగా ఆ శ్రీవారి భక్తులకు సేవ చేస్తున్న సులభ్ కార్మికుల కార్మికుల జీవితాలతో ఆడుకోవద్దని జనసేన పిఏసి సభ్యుడు,ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు డా॥పసుపులేటి హరిప్రసాద్ టిటిడి ఉన్నతాధికారులను హెచ్చరించారు.సులభ్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మె గురువారం నాటికి ఐదవ రోజుకు చేరింది.ఈ సందర్భంగా స్థానిక ఇస్కాన్ గ్రౌండ్ నందు సమ్మె చేస్తున్న కార్మికుల వద్దకు వెళ్లి వారికి జనసేన తరపున మద్దతు పలికారు.సుమారు 500 మందికి అల్పాహారం ఆలయ చేతుల మీదుగా పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నిన్నటి రోజున టిటిడి ఈఓ ధర్మారెడ్డి,జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి,ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డిలు సమ్మెలు జరపకుండా చర్యలు తీసుకుంటామని చెప్పడం దేనికి సంకేతమన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు.జనసేన జిల్లా కార్యదర్శి బాటసారి,రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తన,నగర ఉపాధ్య క్షుడు పార్థు,కార్యదర్శి కిరణ్‌కుమార్,సీనియర్ నాయకుడు ఈశ్వర్ రాయల్,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో ఆన్ కాల్ డ్రైవర్లుగా అవకాశం

-హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు అర్హులు -డిపిటిఓ చెంగల్‌రెడ్డి వెల్లడి

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఏప్రిల్ 27 ప్రభాతవార్త:

ఏపిఎస్‌ఆర్టీసీ తిరుపతి డిపో నందు రోజు వారీ వేతనం ప్రాతిపదికన(ఆన్ కాల్ డ్రైవర్లు) డ్యూటీ చేయడానికి హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొంది 18 నెలలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పిస్తున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి(డిపిటిఓ) తిమ్మాడి చెంగల్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.ఆసక్తి గల వారు తిరుపతి డిపో మేనేజర్ బాలాజిని కానీ,తిరుపతి జిల్లా ప్రజా సమాచార అధికారి(పిఓ) పార్థసారథిని కానీ తమ ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకెళ్లి సంప్రదించాలని ఆయన కోరారు.ముఖ్యంగా ప్రజా రవాణా బస్సులు నడిపిన అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందనిఅన్నారు.వివరాలకు9959225670/9959225669 నెంబర్లను సంప్రదించవచ న్నారు.

## ఇంటర్‌లో వడమాలపేట 48 శాతం ఉత్తీర్ణత

వడమాలపేట, ఏప్రిల్ 27 ప్రభాతవార్త:



వడమాలపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 51 శాతం, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 44 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షల్లో 80 మంది పరీక్షలు రాయగా 64 మంది ఉత్తీర్ణులుగా కాగా రెండవ సంవత్సరం పరీక్షల్లో 90 మందికి 49 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. రెండో సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో కీర్తి 926, వెంకటేష్ 921 అత్యధికంగా మార్కులు సాధించారని ఆయన తెలిపారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

విజయపురం, ఏ ప్రిల్ 27 ప్రభాతవార్త :



మండలంలోని జగన్నాధపురం ప్రాథమిక పాఠశాలలో గురువారం పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. పాఠశాలలో విద్యార్థుల ప్రగతి వివరించడంతో పాటు సాంస్కృ తిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాబు, ఎంపిపి జమున, నాయకులు శ్రీరాముల రాజు, మోహన్, జమున, వెంకటేశులు, నారాయణరాజు, భాస్కర్‌రాజు, విజయ్‌కుమార్, విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో శ్రీ పద్మావతి విద్యార్థినుల ప్రతిభ

తిరుపతి (విద్య), ఏప్రిల్ 27, ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్మీడి యట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభకనబరిచారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డా. సి. భువనేశ్వరి అభినందించారు. ద్వితీయ సంవత్సరంలో బైపిపి నందు శైలాబాను 979, భవ్యసుధ ఎంపిసి 970, కావ్య ఎంపిసీ 970, మౌనిక ఎంఈ సి 964 మార్కులను సాధించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థినులు స్పందన ఎంపిసి 449, మంజీర సుధ బైపిసి 423, ప్రవల్లిక హెచ్ఇసి 484 మార్కులను సాధించారు. వీరితో పాటు ద్వితీయ సంవ త్సరం సైన్స్ విభాగంలో 950 మార్కులు పైగా 26 మంది విద్యార్థినులు సాధించారు. ఆర్ట్స్ విభాగంలో 450 మార్కులు పైగా 52 మంది సాధించారు. ఈ ఘనత సాధించిన ప్రిన్సిపాల్‌ను, అధ్యా పకులను, విద్యార్థినిలనువారితల్లిదండ్రుల నుటిటిడిజేఈవో సదాభార్గవి,డిఈఓడాక్టర్ఎం.భాస్కర్‌రెడ్డి అభినందించారు.

## ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో శశి విద్యార్థుల ప్రతిభ

తిరుపతి (విద్య), ఏప్రిల్ 27, ప్రభాతవార్త

తిరుపతిలోని తనపల్లిలోని శశి జూనియర్ కాలేజీ విద్యార్థులు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాలలో స్థాపించిన మొదటి సంవత్సరంలోని అత్యధిక మార్కులతో పాటు ఉత్తమ ఫలితాలను సాధించి అగ్రస్థానంలో నిలిచారని శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ తెలిపారు. ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను ఎస్. అభిషేక్ 464, టిఎస్ఎన్ రవితేజ 463, ఇ. యశ్వంత్ కుమార్ 461, జీ. కేశవ చౌదరి 460 మార్కులు సాధించడమే కాకుండా , 400 మార్కులకు పైగా 50 శాతం విద్యార్థులు సాధించారని కళాశాల సిఈఓ ఎన్‌విజి ప్రసాద్, డీన్ - డాక్టర్ ఎన్. హరినాథ్ రెడ్డి తెలిపారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన విద్యార్థినీ విద్యార్థులను అధ్యాపక బృందాన్ని వైస్ చైర్మన్ లక్ష్మీ సుప్రియ, డైరెక్టర్లు బూరుగుపల్లి కిరణ్ కుమార్, స్వాతి అభినందించారు.

# కొచ్చి ప్రాజెక్ట్‌కు మేడ్ అట్ శ్రీసిటీ ఎఫ్ఆర్‌పి ఉత్పత్తులు

## -ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు బిఎఫ్‌జి సహకారం గర్వకారణమన్న శ్రీసిటీ ఎండీ



సత్యవేడు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: ఈనెల 25న దేశానికి అంకితం చేస్తూ ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన కొచ్చి వాటర్ మెట్రో యొక్క సూపర్ స్ట్రక్చర్, ఇంటీరియల్ లను శ్రీసిటీలోని బిఎఫ్‌జి ఇండియా పరిశ్రమ సరఫరా చేసింది. ఇది భారతదేశపు మొట్టమొదటి నీటి మెట్రో మాత్రమే కాదు, ఆసియాలోనే ఈ పరిమాణం స్థాయి కలిగిన మొట్ట మొదటి సమగ్ర జల రవాణా వ్యవస్థ కూడా. భారతదేశంలో అగ్రగామి ప్రాజెక్టు అయిన కొచ్చివాటర్ మెట్రో ప్రాజెక్టు యొక్క మెగాసైజ్ సూపర్ స్ట్రక్చర్‌ను ఫైబర్ రీఇన్ఫోర్స్డ్ ప్లాస్టిక్ వాక్యూమ్ ఇన్ ఫ్యూషన్ పద్ధతిని ఉపయోగించి రూపొందించారు. దీని పొడవు 25 మీటర్లు, వెడల్పు 6.5 మీటర్లు, ఎత్తు 2.5మీటర్లు, 100మంది ప్రయాణీకుల సామర్థ్యం కలిగిన ఈవాహన సూపర్ స్ట్రక్చర్, ఇంటీరియర్స్ అన్నింటిని శ్రీసిటీలోని బిఎఫ్‌జి కంపెనీలో తయారు చేస్తారు. ఆపై కొచ్చి షిప్‌యార్డుకు తరలించి అక్కడ ఈ విడి విభాగాలను అనుసంధానం చేసి ఏకీకృతం చేస్తారు. కొచ్చి వాటర్ మెట్రోకు బిఎఫ్‌జి అందించిన సహకారాన్ని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ప్రశంసిస్తూ బిఎఫ్‌జి యొక్క మేడ్ అట్ శ్రీసిటీ ఎఫ్ఆర్‌పి ఉత్పత్తులను కొచ్చి వాటర్ ప్రాజెక్టుతో పాటు, ప్రతిష్టాత్మక వందేభారత్ ఎక్స్‌ప్రెస్, ఇతర అనేక మెట్రో ప్రాజెక్టులలో ఉపయోగించడం గర్వకారణమని అన్నారు. అనేక దేశ, విదేశీ పరిశ్రమలకు కేంద్రంగా విస్తరిస్తున్న శ్రీసిటీ విభిన్న రంగాలలో మేక్ ఇన్ ఇండియా చొరవకు నిజమైన సంకేతంగా నిలుస్తుందని పేర్కో న్నారు. అలాగే ఆల్‌స్టామ్ ఇండియాతో ఉన్న ఒప్పందంలో భాగంగా ఇంటీరియర్స్, ఫ్రంట్ ఎండ్‌లు, డ్రైవర్ క్యాబ్‌లు, సైడ్ వాల్స్, సెంట్రల్ సీలింగ్‌లు, పార్శ్వ పైకప్పులు, గ్యాంగ్‌వే విభజనలు వంటి వివిధ విడిభాగాలను, కొచ్చి, లక్నో, సిడ్నీ, ముంబై3 మాంట్రియల్ మెట్రో ప్రాజెక్టులు, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ మెట్రో ప్రాజెక్టుకు అవసరమైన వివిధ విడిభాగాలను బిఎఫ్‌జి సంస్థ సరఫరా చేస్తుంది.

## ఇంటర్ ఫలితాల్లో నారాయణపురం విద్యార్థిని ప్రతిభ



శ్రీకాళహస్తిరూరల్, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాల్లో మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన బత్తెయ్య,గురవమ్మల పెద్దకుమార్తె తొట్టంబేటి.సుచిత్ర పట్టణంలోని వంశీజూనియర్ కళాశాలలో బైపిసి విభాగంలో 751మార్కులు సాధించి తన సత్తా చాటింది. గ్రామీణ విద్యార్థినులు ఎందులోను తీసిపోరనడానికి సుచిత్రనే నిదర్శనం ఆదినుంచి చదువులో తన సత్తా చాటుతూ ముందుకెళ్తోంది. ఈసందర్భంగా సుచిత్రను కళాశాల కరస్పాండెంట్ రవీంద్రప్రసాద్, ప్రిన్సిపల్ శ్రీకాంత్‌శర్మ, మరియు అధ్యాపకులు అభినందించారు.

## రోడ్డు కోసం రామాపురంలో ఉద్రిక్తత



నగరి, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : నగరి మండలం గుండ్రాజుకుప్పం పంచాయతీ పరిధిలో రామాపురంలో స్కూల్‌కి వెళ్ళడానికి రోడ్డు సమస్యపై ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. స్కూల్‌కి వెళ్ళే రోడ్డు డికెటీ అని సర్పంచ్ బాలప్రసాద్‌రెడ్డి తెలిపారు. అయితే ఇంకోవర్గం ప్రజలు ఇది మా సొంత స్థలమని వాదనలు దిగారు. ఇరువర్గాల వారు దాడి చేసుకునే స్థాయికి వెళ్ళడంతో పోలీసులు అక్కడకు చేరుకుని సమస్యను అదుపులోకి తెచ్చారు. ఈ సమస్యను వెంటనే పరిష్కారించాలని స్థానిక తహశీల్దార్ కోరాలని నిర్ణయించారు. తహశీల్దార్ అందుబాటులో లేకపోవడంతో, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఇరువర్గాల వారిని శాంతింప చేశారు.

## వంతెనపై తాత్కాలికంగా రాకపోకలు ప్రారంభం



సదుం,ఏప్రిల్27 ప్రభాతవార్త : మండల పరిధిలోని పుంగనూరు తిరుపతి రహదారిలో రెండేళ్ల క్రితం వర్షాలకు గార్గేయనదిపై ఉన్న వంతెన కొట్టుకు పోయింది. అప్పటి నుంచి వాహనాలు కలకటవారిపల్లె, తితిదేకల్యాణ మండపం మీదుగా చుట్టు తిరిగి వచ్చేవి. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో నదిపై వంతెన నిర్మాణం ప్రారంభమైంది. ఇటీవల వంతెన నిర్మాణం పూర్త యింది. దీనితో గురువారం వాహనాల రాకపోకలను ప్రారంభించారు. ఇవి తాత్కాలికంగా మాత్రమే. ఈచివర, ఆచివర పనులు పూర్తయిన వెంటనే శాశ్వతంగా రాకపోకలు ప్రారంభించ నున్నట్లు జడ్పీటీసీసోమశేఖరరెడ్డి తెలిపారు. వంతెనపనులను గురువారం మంత్రి పిఏ మునితుకారాంతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం వాహన చోదకులను అనుమతించారు.

## వరసిద్ధుని సేవలో కర్నాటక హైకోర్టు జడ్జి



కాణిపాకం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: కర్నాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌కుమార్ కుటుంబసమేతంగా మంగళవారం కాణిపాకం వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. జడ్జి వెంట చిత్తూరు ఆర్డీఓ రేణుక, ఆలయ సూపరెండెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాబు, ప్రోటోకాల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మొరవ మహాభారత ధ్వజారోహణం



వెదురుకుప్పం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : మండలంలోని మొరవ మహాభారత వార్షిక ఉత్సవాల ప్రారంభంలో భాగంగా గురువారం ధ్వజారోహణం నిర్వహించారు. ఉదయం పురోహితులు పంచ పాండవులు, అమ్మవారి ఉత్సవ, మూలవిరాట్ విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు. పూలు, పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొడిస్తంభం వద్ద వేద మంత్రాల నడుమ మహాభారత ఉత్సవాల ప్రారంభంకు పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజల అనంతరం భక్తులు దైవ దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. పది రోజుల పాటు మధ్యాహ్నం హరికథ కాలక్షేపం, రాత్రి వీధి నాటకాలు నిర్వహించడం జరుగుతుందని పెద్ద భక్తులు హాజరై మహాభారత ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వహక మండలి సభ్యులు కోరారు.నిర్వహకులు మోహన్ రెడ్డి, తారకనాథ రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఫౌర సేవల్లో జాప్యం చేసారా?

### -ఉద్యోగులకు అపరాధ రుసుం విధించిన కమీషనర్ అరుణ

చిత్తూరు, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: నగరపాలక సంస్థ పరిధిలో సిటిజన్ చార్టర్ అమలులో భాగంగా మున్సిపల్ సర్వీసులు, ప్రజా పిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై మున్సిపల్ కమీషనర్ జె.అరుణ సీరియస్ అయ్యారు. ఫౌర సర్వీసులు,ఫిర్యాదులను పరిష్కరించడంలో జాప్యం చేయడం అధికారులపై కఠినచర్యలు తీసుకుని నిభంధనల ప్రకారం ఉద్యోగులకు అపరాధ రుసుం విధిస్తూ గురువారం కమీషనర్ ఉత్తర్వులుజారీ చేశారు. నగర పాలక సంస్థ పరిధిలో ఫౌర సేవలు, ఫిర్యాదులు పరిష్కరించడానికి నిర్ణీత సమయం నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్ణీత సమయంలోపు ఫౌరసేవలు, ఫిర్యాదులు పరిష్కరించాలని కమీషనర్ పలుమార్లు అధికారులను హెచ్చరించారు. అలాగే రోజువారి నిర్వహించేశాఖాపరమైన సమీక్షా సమావేశాల్లో సైతం ఈవిషయాన్ని గుర్తు చేసేవారు. అయినప్పటికి పలు విభాగాల్లోని అధికారులు, ఉద్యోగుల తీరు మారకపోవడంతో కమీషనర్ సీరియస్ అయ్యారు. ఫౌర సేవలు, ఫిర్యాదుల పరిష్కారంలో ఒక్క ఆప్యానికి 100 రూపాయలు అపరాధ రుసుం విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. నగరపాలక సంస్థ పరిధిలో ఇంజనీరింగ్, ప్రజారోగ్య విభాగం, రెవెన్యూ విభాగాలకు సంభ:దించి 14 మంది అధికారులు, ఉద్యోగులు, ఇద్దరు అమినిటి కార్యదర్శులు, నలుగురు పారిశుద్య పర్యావరణ కార్యదర్శులకు వారి సర్వీసుల సంఖ్యను బట్టి కమీషనర్ అపరాధ రుసుం విధించారు.

## బర్డ్,పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం వైద్యుల సేవలు అభినందనీయం

### -నూతనపరికరాల తయారీకి బర్డ్‌లో ప్రత్యేక ల్యాబ్ -డాక్టర్ మిను బాజ్‌పాయ్



తిరుమల,ఏప్రిల్ 27ప్రభాతవార్త ప్రతినిధి: ధార్మిక సంస్థ టిటిడి సేవాభావంతో వైద్యసేవలందిస్తున్న స్విమ్స్, బర్డ్, పద్మావతిచిన్నపిల్లల హృదయాలయం ఆస్పత్రుల్లో వైద్యుల సేవలు అభినందనీయమని నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మిను బాజ్‌పాయ్ అన్నారు. పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం, బర్డ్‌ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్యసౌకర్యాలు, స్పెషలిస్టు డాక్టర్లు ఉన్నారన్నారు. ఈ ఆస్పత్రులను గురువారం ఆయన సందర్శించారు. గుండెకు సంబంధించి బాధపడుతున్న చిన్నపిల్లలతో తల్లిదండ్రులు ఇక్కడకు చికిత్సకోస వస్తుండటం గొప్పవిషయమన్నారు.వైద్యరంగంలో నూతన పరికరాల తయారీకోసం బర్డ్‌లో ప్రత్యేకంగా ల్యాబ్‌ను ఏర్పాటుచేస్తామని, ఇందుకోసం దేశంలోని ఐదు ప్రముఖ ఐఐటిలతో ఒప్పందం కుదుర్చుకోవడం పట్ల టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, జెఇఒ సదాభార్గవి పనితీరును డాక్టర్ మిను బాజ్‌పాయ్ ప్రశంసించారు. పద్మావతిఆస్పత్రిలో 1300 గుండె సంబంధిత ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారన్నారు.

## ఉద్యోగుల సంక్షేమానికి కృషి

### -నకిలీ వెబ్‌సైట్ నిర్వాహకులపై క్రిమినల్ కేసులు -టిటిడి ఛైర్మన్ సుబ్బారెడ్డి



తిరుపతి,ఏప్రిల్ 27ప్రభాతవార్త: ధార్మికసంస్థ టిటిడిలో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి పాలకమండలి, అధికారులు ప్రత్యేక చొరవచూపుతామని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి ఉద్ఘాటించారు. ఇప్పటికే టిటిడి ఉద్యోగులకు ప్రభుత్వం చొరవతో 300 ఎకరాల భూమిని సేకరించి ఇంటి స్థలాలను సాకారం చేశామన్నారు.త్వరలోనే ఉద్యోగులకు ఇంటిపట్టాలు ఇస్తామన్నారు. టిటిడి పై నకిలీవెబ్‌సైట్లు నిర్వాహకులను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. తిరుపతిలోని వినాయకనగర్ క్వార్టర్స్‌లో ఉద్యోగుల కోసం 1.40కోట్ల రూపాయలతో నిర్మించిన ఫంక్షన్ హాల్‌ను టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి, జెఇఒ సదాభార్గవి ,బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్‌తో కలసి ఛైర్మన్ సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఉద్యోగులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యచికిత్సలందించేందుకు ఈహెచ్‌ఎస్ అమలు చేస్తున్నామన్నారు. ఉద్యోగులు మరింత భక్తితో భక్తులకుసేవచేయాలని పిలుపునిచ్చారు.

## శివయ్య సేవలో జార్ఖండ్ గవర్నర్

### పాతాళ వినాయకుని దర్శించుకున్న గవర్నర్

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 27 ప్రభాతవార్త : మానవుడు ఆచరించాల్సిన నాలుగు ధర్మాలకు అనుగుణంగా 11 శతాబ్దంలో నిర్మించిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రపంచదేశాల నుంచి అతిధులు అధికంగా వస్తున్నారు.ఈ నేపద్యంలో జార్ఖండ్ గవర్నర్ సిపి రాధాకృష్ణన్ కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి, ఇఒ వికెసాగర్‌బాబు, ఆర్డీవో రామారావుల సారధ్యంలో వేదపండితులు ప్రోటోకాల్‌మేరకు స్వాగతం చెప్పారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న గవర్నర్ ఆలయంలోని 'పాతాళ వినాయక ఆలయం' గురించి వాకబు చేసారు. ఆలయ నిర్వాహకులు గవర్నర్‌ను పాతాళ వినాయక



ఆలయం వద్దకు తీసుకెళ్ళారు.సుమారు 35 అడుగుల లోతులో ఉన్న పాతాళ వినాయకుని గవర్నర్ దర్శించుకొని పూజలు జరిపి హారతులిచ్చారు.టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హరియాదవ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## పార్టీ బలోపేతం చేసేదిశగా అడుగులు

### -సాకే శంకర్‌ను సన్మానించిన గౌడపేరు



తిరుపతి,ఏప్రిల్ 27ప్రభాతవార్త: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసుకునేదిశగా వేస్తున్న అడుగుల్లో పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు నాయకత్వంలో పిసిసి ఎస్‌సి విభాగం రాష్ట్ర ఛైర్మన్‌గా సాకే శంకర్ నియమితులయ్యారు. అనంతపురం జిల్లాకు చెందిన ఈయన ఎస్‌సి విభాగం ఛైర్మన్ కావడంతో ఆ విభాగం ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా గురువారం విజయవాడలోని పిసిసి కార్యాలయంలో సాకే శంకర్‌ను పిసిసి ఎస్‌సి విభాగం కో ఛైర్మన్ గౌడపేరు చిట్టిబాబు ,మల్లికార్జున్, వైస్ ఛైర్మన్ కోటేశ్వరరావు, నెల్లూరు ఎస్సీవిభాగం ఛైర్మన్ పవన్‌కుమార్ కలసి అభినందనలు తెలిపారు. పుష్పగుచ్ఛమిచ్చి దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకార పద్మశ్రీ, పిసిసి ఎస్సీ విభాగం మాజీ ఛైర్మన్ వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

## జార్ఖండ్ గవర్నర్‌కు శ్రీవారి చిత్రపటం బహుకరణ



తిరుపతి,ఏప్రిల్ 27ప్రభాతవార్త: తిరుపతికి విచ్చేసిన జార్ఖండ్ గవర్నర్ సిపి రాధాకృష్ణన్‌ను గురువారం తిరుపతి బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్,రాటకొండ విశ్వనాథ్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, ఎంఆర్‌రాజ, జయంత్ కుమార్, శరత్ తదితరులు కలిశారు. పద్మావతి విశ్రాంతి గృహంలో గవర్నర్‌ను కలసి దుశ్శాలువతో సన్మానించి శ్రీవారిచిత్రపటం బహుకరించారు.

## ఇంటర్ పరీక్షల్లో సత్తాచాటిన చరిష్మా



శ్రీకాళహస్తి,ఏప్రిల్ 27 ప్రభాతవార్త : ఇంటర్‌పరీక్షల్లో విద్యార్థినులు తమ సత్తా చాటి శ్రీకాళహస్తి పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేసారు. శ్రీకాళహస్తిలో చదువుకుంటూ ఇంటర్ విద్యను తిరుపతి కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో చేరి తమ సత్తా చాటారు.ఈ నేపద్యంలో శ్రీకాళహస్తిలోని రత్నం పాఠశాలలో పదవ తరగతి వరకు చదివి ఇంటర్ విద్యకోసం తిరుపతిలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో చేరారు. బుధవారం సాయంత్రం విడుదలైన ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో శ్రీకాళహస్తికి చెందిన చరిష్మా ఎంపిసి గ్రూప్‌లో 470కి గాను 461 మార్కులు సాధించారు. శ్రీకాళహస్తి మండలం ముచ్చి వోలుకు చెందిన మోహన్‌రాజు, సుజాత దంపతుల మొదటి కుమార్తె చదువు కోసం శ్రీకాళహస్తి పట్టణానికి మారారు. తాము నివాసముంటున్న కాలనీకి సమీపంలోని రత్నం పాఠశాలలో పదవ తరగతి వరకు చదివింది. పదవ తరగతిలో కూడా చరిష్మా తన చరిష్మాను చాటి 573 మార్కులు సాధించింది. తరువాత శ్రీచైతన్య మినాక్షిసాధన్‌లో(పేరూర్) చేరారు. చదువులో తమ సత్తా చాటిన చరిష్మా 465 మార్కులు వస్తాయని భావించారు.కానీ 461 మార్కులు సాధించారు. దాంతో శ్రీకాళహస్తికి చెందిన పలువురు చరిష్మాను అభినందించారు.

## దళిత సత్రం కోసం దళిత ఉభయదారుల నిరసన

కాణిపాకం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త: కాణిపాకం వినాయక స్వామివారి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా ప్రధాన ఆలయం పక్కన తొలగించిన దళిత సత్రానికి ప్రత్యామ్నాయంగా ఆలయ పరిసరాల్లోనే దళిత సత్రాన్ని కేటాయించాలని ఆలయ దళిత ఉభయదారులు గురువారం కాణిపాకంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. దేవాదాయశాఖ రిటైడ్ అదనపు కమీషనర్, ఆలయ మాజీ ఈఓ జి.కేశవులు ఆధ్వర్యంలో దళిత ఉభయదారులు ఈనిరసన కార్యక్రమం చేపట్టారు.దళిత ఉభయదారులు కాణిపాకంలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తొలగించిన దళిత సత్రంకు ప్రత్యామ్నాయంగా ఆలయ పరిసరాల్లోనే దళిత సత్రాన్ని కేటాయించాలని తీర్మానించారు.


**డాక్యుమెంట్స్ దారిపోయినది**

వి.వేణుగోపాల్, తండ్రి వి.సుబ్రమణ్యం, 3-48, మండివారి వీధి, శ్రీకాళహస్తి టౌన్, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో నివసించు మేము శ్రీకాళహస్తి, పెళ్ళిమండపం వీధి దగ్గర, జిరాక్స్ సెంటర్ వద్ద మా స్థిరాస్థికి సబంధించి సర్వే నెం.34/2, ప్లాట్ నెం.134 ఒరిజినల్ డాక్యుమెంట్స్ జిరాక్స్ చేస్తుండగా దారిపోయినవి. డాక్యుమెంట్ నెం.1207/1986, తేది 29-1986, ఈ డాక్యుమెంట్స్ దొరికిన వారు పై చిరునామాకు అందజేయగలరు.


## హంసవాహనంపై అగస్తీశ్వరుని సాక్షాత్కారం



నారాయణవనం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : మండలంలోని సముదాయం గ్రామంలో ప్రసిద్ధి చెందిన టిటిడి అనుబంధ ఆలయం మరగదవల్లీ సమేత అగస్తీశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడవరోజు గురువారం రాత్రి పురవీధుల్లో హంస వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మేళతాళాలు, మ ంగళ వాయిద్యాలు, భాణసంచా వేడుకల నడుమ స్వామివారు ఊరేగింపు సందర్భంగా అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. అంతకుముందు ఆలయంలో శుద్ధి, నిత్యకైంకర్య పూజా కార్యక్రమాల అనంతరం వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. స్వామి, అమ్మవారి ఊరేగింపు సందర్భంగా టిటిడి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కళాకా రులు కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే అన్నమయ్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో సంకీర్తలు, హరికథలను వినిపించారు. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. టిటిడి అధికారులు భక్తులకు ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎఇఓ మోహన్, పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, అర్చకులు రమేష్ గురుకుల్, రమణిగురుకుల్, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తనపల్లెలో ముగిసిన ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 సేవాశిబిరం

తిరుపతి (క్రీడ), ఏప్రిల్ 27 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, జాతీయ సేవా పథకం యూనిట్ 3 దత్తత గ్రామమైన తనలపల్లిలో కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవ శిబిరం గురువారంతో ముగిసింది. కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన దిశా పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ అరుణ మాట్లాడుతూ విద్యార్థులు దిశా నిర్దేశంతో ముందుకు వెళ్లాలని, ప్రలోభాలకు లోనవ్వకుండా విచక్షణతో విలువైన జీవితానికి మెరుగులు దిద్దుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క వాలంటీర్ విధిగా దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కాత్యాయని మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరాల, వాలంటీర్ల వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో తోడ్పడుతాయని, వారి ప్రతిభను, సేవా నిరతిని చాటుకోనేందుకు ఇది చక్కటి అవకాశం అని, గ్రామీణ పరిస్థితుల పట్ల పరిసరాల పట్ల అవగాహన పెంపొందించి, సామాజిక సంబంధిత అంశాల పరిశోధనల పట్ల ఈ శిబిరాలు ఆసక్తిని రేకిస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రత్యేక సేవా శిబిరాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న వాలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారిణి డా. నీరజ, పంచాయితీ సెక్రటరీ మురళి, గ్రామ సర్పంచ్ సునీత, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## కొనసాగిన ద్రవిడ తాత్కాలిక ఉద్యోగుల పెన్ డౌన్

కుప్పం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : ద్రవిడ వర్సిటీలో పనిచేస్తున్న తాత్కాలిక బోధనేతర సిబ్బంది గురువారం కూడా పెన్ డౌన్ కార్యక్రమం చేపట్టారు. తమకు ఖచ్చితంగా పాత బకాయిలతో పాటు వేతనాలు చెల్లించాలని వర్సిటీ ప్రధాన గేటు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. తమకు సిఎఫ్ఎంఎస్ ద్వారా వేతనాలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తే తప్ప విధుల్లో చేరబోమన్నారు. కాగా సమ్మె కొనసాగించేందుకు గాను పోలీసు అధికారులకు సమ్మె నోటీసులు అందించినట్లు పేర్కొన్నారు.


**SRIKALAHASTI MUNICIPALITY**

**'e' PROCUREMENT- Tender NOTICE**

**Commissioner, Srikalahasti Municipality**
has invited tenders for the **34 works with Rs.88.22 lakhs** vide **Tender Notice** NIT No.67, 76, to 83, 85 to 92, 94 to 97/2022-23 & 1 to 13/2023-24, Dated: 25.04.2023
The Municipal Commissioner is empowered either cancellation/ postpone/ modification of the Tenders, Further Details can be seen at Office Notice Board and 'e'Procurement Market place @ http:// tender.apeprocurement.gov.in

**Commissioner, Srikalahasti Municipality**



**సంయుక్త కలెక్టర్ వారి కార్యాలయం, తిరుపతి** **షార్ట్ టెండర్ నోటీసు**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారము మే నెల 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు ముఖ్యమంత్రి రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు కప్ నిర్వహించబడును. అందులో పాల్గొను క్రీడా మైదాన ప్రాంతము నందు షామియానా ఏర్పాటు చేయవలసి వున్నది. అనుభవం కలిగిన పంఫిణీదారులు 20x 40 సైజు కలిగిన షామియానాలు 10 నెంబర్లు మరియు మెయిన్ స్టేజీ గాను 60x24 సైజు గల షామియానా ఏర్పాటు చేయుటకు సీట్లు కవరు టెండర్లు స్వీకరించుటకు ప్రకటన చేయబడినది. అనుభవం కలిగిన సప్లైదారులు కోవిడ్ మరియు ప్రభుత్వం అధికారిక కార్యక్రమాల నందు అనుభవం కల్గిన సప్లైదారులు సంబంధిత ధృవీకరణ పత్రములు తప్పని సరిగా జతపరచి 28-4-2023వ తేదీన శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, బాలాజీ కాలనీ తిరుపతి కార్యాలయమునందు టెండరు ఫారం తీసుకొని పూర్తి చేసిన ఫారంను తేది 29-04- 2023వ తేదీ మధ్యాహ్నం 12.00 గంటల లోపు శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, బాలాజీ కాలనీ తిరుపతి కార్యాలయములో సీల్డ్ బాక్స్ నందు సమర్పించవలసిదిగా కోరడమైనది. 12.00 గంటల తర్వాత ఎట్టి పరిస్థితిలోను టెండరు దరఖాస్తు ఫారంను స్వీకరించబడదు. అదే రోజు సాయంత్రం 4.00గం.లకు సంయుక్త కలెక్టర్, తిరు పతి వారి కార్యాలయం నందు ఓపెన్ చేసి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి అర్హులైన వారికి 4.00గం.లకు అనుమతిని ఇవ్వబడును.

**గమనిక :** ఏ నోటీసు లేకుండి టెండర్లు రద్దు చేయుటకు మరియు వాయిదా వేయుటకు సంయుక్త కలెక్టర్, తిరుపతి జిల్లా వారికి హక్కు కలదు.

స్థలము : తిరుపతి — సంయుక్త కలెక్టర్
తేది : 27.04.2023 — తిరుపతి జిల్లా వారి తరపున



**సంయుక్త కలెక్టర్ వారి కార్యాలయం, తిరుపతి** **షార్ట్ టెండర్ నోటీసు**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారము మే నెల 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు ముఖ్యమంత్రి రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు కప్ నిర్వహించబడును. అందులో పాల్గొను క్రీడాకారులకు 30-04-2023 తేదీ మధ్యాహ్నం నుండి 05-05-2023 రాత్రి వరకు ప్రతిరోజు సుమారు 5500 మందికి (మూడుపూటలు) ఆహారం అందించుటకు సీల్డ్ టెండర్లు స్వీకరించుటకు ప్రకటన చేయబడినది. ఉత్సాహవంతులైన మరియు ఇంతకుముందు కోవిడ్ మరియు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు ఫుడ్ అరేంజ్మెంట్స్ చేసిన అనుభవం కలిగిన క్యాటరర్స్, సబంధిత ధృవీకరణ పత్రము తప్పనిసరిగా జతపరచవలెను. 28-04-2023వ తేదీన శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, బాలాజీ కాలనీ తిరుపతి కార్యాలయమునందు టెండరు ఫారం తీసుకొని పూర్తి చేసిన ఫారంను తేది 29-04- 2023వ తేదీ మధ్యాహ్నం 12.00 గంటల లోపు శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, బాలాజీ కాలనీ తిరుపతి కార్యాలయములో సీల్డ్ బాక్స్ నందు సమర్పించవలసిదిగా కోరడమైనది. 12.00 గంటల తర్వాత ఎట్టి పరిస్థితిలోను టెండరు దరఖాస్తు ఫారంను స్వీకరించబడదు. అదే రోజు సాయంత్రం 4.00గం.లకు సంయుక్త కలెక్టర్, తిరు పతి వారి కార్యాలయం నందు ఓపెన్ చేసి టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి అర్హులైన వారికి 4.00గం.లకు అనుమతిని ఇవ్వబడును.

**గమనిక :** ఏ నోటీసు లేకుండి టెండర్లు రద్దు చేయుటకు మరియు వాయిదా వేయుటకు సంయుక్త కలెక్టర్, తిరుపతి జిల్లా వారికి హక్కు కలదు.

స్థలము : తిరుపతి — సంయుక్త కలెక్టర్
తేది : 27.04.2023 — తిరుపతి జిల్లా వారి తరపున


# పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా వనరులను పెంచుకోవాలి




## స్విమ్స్ 12వ స్నాతకోత్సవ సభలో వక్తలు

తిరుపతినగరం, ఏప్రిల్ 27 ప్రభాతవార్త : రోజు రోజుకు పెరుగుతున్న రోగుల సంఖ్యకు అనుగుణంగా హాస్పిటల్స్‌లో మానవ వనరులను పెంచకోవాల్సి అవసరం వుందని 12వ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి డాక్టర్ మిను బాజ్‌పాయ్ అన్నారు. గురువారం శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ యూనివర్శిటీ 12వ స్నాతకోత్సవాన్ని మహతి ఆడిటోరియం నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, ముఖ్యఅతిథిగా వైస్ ప్రెసిడెంట్, విశిష్ట ఎగ్జిక్యూటివ్ డెరెక్టర్, న్యూ ఢిల్లీ డాక్టర్ మిను బాజ్‌పాయ్, టిటిడి ఇఒ ఏ.వి.ధర్మారెడ్డి, జెఇవో సదా భార్గవి, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంగమ్మ, డీన్ డాక్టర్ అల్లాడు మోహన్, రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, డాక్టర్ రామ్‌లు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు డాక్టర్ బి.వెంగమ్మ 12వ స్నాతకోత్సవ నివేదికను సమర్పించారు. చాన్స్ లర్ వై.వి.సుబ్బారెడ్డి పట్టాలను అందుకున్న విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్విమ్స్ హాస్పిటల్ ముప్పై సంవత్సరాలుగా వైద్య రంగంలో సాగిస్తున్న కృష్టిని కొనియాడారు. దేశంలో దాదాపు 15లక్షల మంది మెడికల్ స్పెషాలిస్టుల కొరత వుందని, ప్రభుత్వాలు ఆసుపత్రులను విరివిగా ఏర్పాటు చేసి వైద్య సీట్లను పెంచాలన్నారు. వైద్య విద్య బోధనా రంగంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిందన్నారు, రానున్న రోజుల్లో వైద్య రంగానికి ఉజ్వల భవిష్యత్తు వుందన్నారు. స్విమ్స్ హాస్పిటల్స్‌లో హాస్టల్ విద్యార్థిని, విద్యార్థులకు ఉచిత భోజన వసతి కల్పిస్తున్నమన్నారు. స్విమ్స్ ఆసుపత్రిని టిటిడి తీసుకున్న తర్వాత అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని భవిష్యత్తులో సిమ్‌సను ప్రపంచంలోనే అంత్యున్నత స్థాయి సంస్థగా తీర్చిదిద్దుతామని టిటిటి ఇఒ అన్నారు. 12వ స్నాతకోత్సవంలో యంబిబిఎస్, యుజి., పిజి. నర్సింగ్, ఫిజియోథెరఫీ, పారామెడికల్, డిప్లొమో కోర్సులు పూర్తి చేసిన 476 మంది విభాగాల విద్యార్థులకు డిగ్రీలు ప్రధానం చేశారు. కార్యక్రమంలో స్విమ్స్ యూనివర్శిటీకి చెందిన వివిధ కళాశాలకు చెందిన ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.